


నా ప్రక్కన ఖాళీగావున్న బెడ్ మీదకి ఓ వ్యక్తిని స్ట్రెచర్ మీద తీసుకొచ్చి చేర్చారు. స్పృహలేదతనికి. ఇవతల బెడ్ మీదున్న రాజన్న అడిగాడు.

"ఏం బాబుగారూ! ఆ కుర్రాయనకేం జబ్బో?"

"ఏమో రాజన్నా ఎలా తెలుస్తుంది!"

రాజన్న అనే అతను గూడా రెండ్రోజుల క్రితమే ఎడ్మిట్ అయ్యాడు. బందరు ప్రక్కదే ఏదో పల్లెటూరట అతనిది. వ్యవసాయం వృత్తి. ఈ వివరాలు మర్నాడు బాధ తగ్గినప్పుడు అతనే చెప్పాడు.

డాక్టర్ వచ్చి నా ప్రక్క బెడ్ మీద వ్యక్తికి ఏదో ఇంజక్షన్ ఇచ్చాడు.

నేను పాత పేషెంట్ నవడంవల్ల నావేపు ఓ చిరునవ్వు పారేశాడు.

"ఏమయింది సార్, ఇతనికి?" అడిగాను.

"ఇది ప్రేమ జబ్బు మాస్టారూ! లవ్ ఎఫయిర్! ఫెయిలయేప్పటికి వళ్ళు మండి విషం త్రాగాడట" అని వెళ్ళిపోయాడు డాక్టరు.

"ఏటయ్యా! డాటరు బాబు అంటారు?"

"ఇతను ప్రేమ విఫలమయేసరికి విషం తీసుకొన్నాడట!"

"అరెరెరె! నా శావా బాబూ! పాపంటే దీన్ని తరగా ఎంత సనకయి పోయిందో!.. పాపంటే నా మటుకు నాకు సచ్చే భయం బాబూ! నువ్వు నమ్మూ నమ్మకపో! ఆ!.." రాజన్న మాటలు వింటూంటే నవ్వు వచ్చింది నాకు.

చావంటే ఎవరికి మాత్రం భయం వుండదు? కాని కొన్ని కొన్ని పరిస్థితులు మనిషికి చావు కంటె కూడా భయంకరంగా కన్పిస్తాయి. అప్పుడే వాటి నుంచి తప్పించుకోడానికి మనిషి చావుని ఆహ్వానిస్తాడు.

రాత్రి పదయింది. హాస్పిటలంతా నిశ్శబ్దమయి పోయింది. నిద్రపోవడానికి ప్రయత్నించసాగాను.

ప్రొద్దున్న లేచే రికి ఏడయిపోయింది. రాజన్న అప్పటికే లేచి కూర్చున్నాడు. "లెగిశారా బాబూ! మాట్టాడ్డానికోరూ లేక మీరెప్పుడు నెగుస్తారా అని సూస్తుండా!"

నవ్వి పేస్ట్, బ్రష్ తీసుకొని బాత్‌రూం వేపు నడిచాను. తిరిగిరాగానే అన్నాడు రాజన్న.

"వాళ్ళిద్దరినీ రాత్రేళ తీసుకొచ్చారు బాబూ! పాపం! ఆళ్ళకే టయిందో ఏమో!" మా ఎదుటి లైన్‌లో రెండు బెడ్‌ల మీద ఇద్దరు వ్యక్తులు పడుకొని వున్నారు. నా ప్రక్క బెడ్ మీదతను లేచి కూర్చున్నాడు. మనిషి చాలా నీరసంగా కన్పడుతున్నాడు. గడ్డం బాగా పెరిగి నిజంగా భగ్నప్రేమికుడులానే కన్పడుతున్నాడు. ఎదుటి లైన్‌లో వాళ్ళిద్దరూకూడా లేచారు. ఒకతనికి సుమారు ముప్పై ఏళ్ళ లోపు వుంటుంది వయసు. మనక కళ్ళజోడు వుంది. మనిషి చాలా విచారంగా వున్నాడు. రెండో అతనికి ఓ ఇరవై సంవత్సరాల వయసుంటుంది. బట్టలూ క్రాపూ చూస్తాంటే చదువుకొనే కుర్రాడిలా అనిపించాడు.

"ఏమండీ! ఇప్పుడెలా వున్నారు?" సంభాషణ ప్రారంభించడానికి వాళ్ళిద్దరినీ ఉద్దేశించి అడిగాను.

"థాంక్యూ సర్... అయామ్ ఆల్‌రైట్ నవ్!" కళ్ళజో డతను జవాబిచ్చేడు.

"ప్రస్తుతం ఈ గదిలో వున్నది మనం అరుదుగురమే. ఏదో ఒకటి మాట్లాడుకొంటూంటే అందరికీ టైమ్ పాసవుతుంది!" అన్నాను అందరి వంకా చూస్తూ.

"కరెక్ట్ గురూగారూ! ముందస్తుగా మన గురించే క్లుప్తంగా తెలుసుకొందాం!" అన్నాడు అతని ప్రక్కని కుర్రాడు.

'ముందు నేనే చెప్తాను "పేరు సారథి. కొంత కాలం రైల్వేలో చేశాను. హైఫీవర్‌లో ఇక్కడకు చేరాను."

నా ప్రక్కనున్న వ్యక్తి వంక చూశాం అందరం. తప్పదన్నట్లు మాట్లాడేడతను.

"పేరు రామకృష్ణ! రిజర్వ్ బాంక్‌లో పని..." ఇంకేమీ చెప్పలేదతను.

ఎదురుగా వున్న కళ్ళజోడాయన చెప్పేడు.

వీలులేదు.. కావాలంటే రేపెళ్ళమంటోంది. రేపటి వరకూ ఆ పిచ్చిరుండొద్దూ..'' ఉసూరుమంటూ బెడ్ మీద కూలబడ్డాడతను.

అతని బాధ చూస్తే నాకు నవ్వాగటంలేదు.

''అరె! అరె!'' అంటూ లేచి మంచం క్రింద దూరాడతను ''ఎలుకలు సార్! నర్స్ ఇచ్చిన టాబ్లెట్స్ ఎత్తుకుపోతున్నయి...స్ప్రింగ్ బిళ్లల్లా వున్నాయి కామోసువాటికి... హారి! ఒక్కటి కూడా లేకుండా ఎత్తుకుపోయినయి సార్!''

''ఆల్‌రైట్! ఏడవుతోంది.. ఇహ నిద్రపోదా మండీ! నిద్ర దేహమునకు ఆరోగ్యమిచ్చును. గుడ్ నైట్ టు ఆల్!''

ప్రొద్దున్న రాజన్న గొంతు విని మెలుకువ వచ్చింది.

''నువ్వేమన్నా చెప్పు బుల్లోడా! ప్రేమిస్తం ఏమిటంటు! శాంతనం కాపోతే! మా కాలంలో పరాయి ఆడపిల్లంక కన్నెత్తి చూస్తే సాలు! వూళ్లో ఉడాళ్ళంటిరూ కర్రి మెక్కల రగ్గాలే సేవోరు. ఆ!''

''పోవయ్య! నువ్వింకా మీ రోజుల్లోనే వున్నావు. ప్రేమించుకోడంలో వున్న మజా నీకేం తెల్సని. కావాలంటే ఇప్పటికయినా మించిపోయింది లేదు. మా వూళ్లో ఎవరయినా ఓపిల్లని ప్రేమించిచూడు.''

''ఓరి సిన్నోడా! నేను సక్కగా తిరగటం నీకిట్టం లేదల్లే వుంది!''

''ఏం మోహన్రావుగారూ! ప్రొద్దున్నే పాదన లోకి దిగారు..'' నవ్వుతూ ప్రశ్నించాను.

''గుడ్మార్నింగ్ సార్!..ఆ! ఏదో కాలక్షేపానికి మొదలెట్టాన్లెండి!''

ఏడుగంటలకల్లా సుశీల కాఫీ టిఫినూ తీసుకొచ్చింది. ఉప్మా అందరికీ సర్ది గ్లాసుల్లో కాఫీ పోసింది.

''వదినగారూ! ఉప్మా చాలా మోతగా వుందండీ! ఏమ్మాష్టారూ! మీ కభ్యంతరం లేపోతే, హాస్పిటల్ నుంచి బయటపడ్డాక రోజూ మీ యింట్లో టిఫిన్ చేయడానికి పర్మిషనివ్వండి!''

''తప్పకుండా రండి..'' అన్నాను నవ్వుతూ.

''మరి మేమో!'' లాయరు, రామకృష్ణ ఇద్దరూ అడిగేరు.

''అందరూనండి! అందుకే బహువచనం ఉపయోగించాను...'' సుశీల వెళ్లిపోయింది.

అప్పుడే హాలు గడప దగ్గర నుంచున్న పాపని గమనించాను. ఏడెనిమిదేళ్ళుంటవేమో.

''ఇట్రా పాపా! ఎవరు కావాలి?..'' పిలిచాను.

''చాలా ముద్దొస్తుందండీ! పాప!'' రామకృష్ణ అన్నాడు.

''భలే వారేనండీ! ముద్దొస్తోందని మెల్లగా అంటారేం? రోజూ ఈ పాపని ముద్దెట్టుకొని, ఓ చాక్లెట్ ఇవ్వందే కాలేజీకి వెళ్ళేవాణ్ణి కాదు సార్! కాని కొన్నాళ్ళ తరువాత పాప కంటె వాళ్ళక్కయ్యే బాగా ముద్దొస్తున్నట్లనిపించింది. అంతే రకీమని ఆవిడ నేనూ ప్రేమలో పడిపోయేం. మేరీ చెల్లెలండి! పేరు విజీ!''

మోహన్రావు దగ్గరకు చనువుగా వెళ్ళింది పాప.

''ఏమండీ! మరే! అక్కయ్య మీకీ వుత్తరం ఇమ్మంది!''

''ఓహో! లవ్ లెటర్! ఎవరూ వినకండి సార్. పైకి చదవడం అలవాటు నాకు. 'మై డియర్ మోహన్, నిన్ను 'డబుల్‌డెక్' గాడు హాస్పిటల్లో చేర్పించాడన్న దగ్గర్నుంచి నాకు ఎంత భయంగా వుంది. నా అనుమానం అసలు నిన్నూ నన్నూ కల్సుకోకుండా చెయ్యాలని నిన్ను అక్కడ చేర్చాడేమో! నిన్న రాత్రంతా నిద్రలేదు. నిద్రపోయిన గంటసేపూ నువ్వే కలలో..

''కట్..కట్..'' అరిచారు లాయరు ''స్వవిషయాలు పబ్లిక్ చేస్తున్నావు తమ్ముడూ! మేరీ తరపున నీ మీద చర్య తీసుకొంటాను..''

''ఇంతకీ ఆ డబల్ డెక్కెవరు?...''

''మా మావయ్యని పేరి అలా అని ముద్దుగా పిల్చుకొంటుంది లెండి!''

''గుడ్‌మార్నింగ్ టు ఆల్!'' డాక్టర్ రౌండ్ కొస్తున్నారు. నిశ్శబ్దం! విజ్జీకి ఏదో చెప్పి పంపించేశాడు మోహన్రావు.

మధ్యాహ్నం స్పృహ లేకుండా పడిపోయాడు లాయర్. రాత్రి తొమ్మిది వరకూ మగతగానే పడుకొన్నాడు. మోహన్రావు, రామకృష్ణ, రాజన్న నేనూ పదిగంటల వరకూ ఏవేవో మాట్లాడుతూనే వున్నాం. కొద్దిగ కళ్ళు విప్పి చూశాడు లాయరు.

''ఎలా వుందిసార్ వంట్లో!'' అడిగాడు మోహన్రావు.

''ఆల్‌రైట్ నవ్'' అంటూ నీరసంగా నవ్వాడతను.

మర్నాడు ప్రొద్దున్న నిద్ర లేచేసరికి ఏడయిపోయింది. రామకృష్ణ మళ్ళీ మొదటి కొచ్చేశాడు. కిటికిలోంచి బయటకు పరాంగా చూస్తూ కూర్చున్నాడు. రాజన్న కాళ్ళ మధ్య తల పెట్టుకొని మౌనంగా కూర్చున్నాడు. లాయర్ పడుకొనే పిచ్చివాడిలా పైకి చూస్తున్నాడు.

''ఏమండీ..మోహన్రావ్.. మనకికలేడు సార్!''

గుండె ఝల్లుమంది నాకు అతని ప్రక్క ఖాళీగా వుంది క్రొత్త దుప్పటి పరచి వుంది

''రాత్రి రెండింటికి.. హఠాత్తుగా గుండెనొప్పి వచ్చిందండి!. శ్వాస అందలేదు . ఆక్సిజన్.. ఇచ్చినా లాభం లేపోయింది!'' రామకృష్ణ కళ్ళ వెంబడి నీరు కారిపోయింది. లోపలకు వస్తున్న సుశీల అప్రతిభురాలయి నుంచుండిపోయింది. ఆమె చేతిలో టిఫిన్ గిన్నె క్రిందపడిపోయింది...

అప్పుడే లోపలకు వస్తోంది విజ్జీ..

''ఆ పాపకేం జవాబు చెప్తారిప్పుడు?'' తల తిరుగుతున్నట్లనిపించింది నాకు.

''చావుని గురించి మాకు ధైర్యం చెప్పి తను వెళ్ళిపోయాడ్సార్!'' వచ్చే ఏడుపుని బిగపడుతూ అన్నాడు రామకృష్ణ...

''గుడ్ మార్నింగ్ టు ఆల్...'' లోపలకు వస్తోంది నర్స్...... ●


మీ చర్మ సౌందర్యమునకు...




నిర్మల

ఆయుర్వేదిక్ సోప్పు వాడండి

Mfrs: NIRMALA CHEMICALS, COCHIN 2.

Agents: M/S PRAGATI AGENCIES, VIJAYAWADA-1. (Phone 5486)





పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదియు, మీ సరియైన భర్యను గురించియు మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన మీకుఇష్టమగు ఒక పుష్పము పేరును, మీరు వ్రాయుతేదీ, వేళ వివరములున్నా, మీ సరియైన చిరునామా, వెంటనే వ్రాసిపంపండి. జ్యోతిషశాస్త్రములోని రహస్య గణితము ముఖ్యముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసినతేదీ లగాయతు 12 మాసములలోను మీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, వ్యవహారములలో మీకు జయముకలుగునో, ఉద్యోగం విషయంలో పెంచిపెద్దలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, విధినిషేధములు, లాటరీ, అకస్మాత్ద్రవ్య లాభముమొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1.25పై.లకు వ్రాతము వి. పి. గా పంపగలము. వి. పి. చార్జీలు ప్రత్యేకం. దుష్టగ్రహములేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపగలము. వివరములు మా పూచీపై పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనియెడల పైకము వాపసుచేయబడును. ఒకసారిపరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTISHI,
(A W. P.) Post Box No. 86, JULLUNDUR CITY.